


[5—10—47 సంచిక నుండి

## ౧౧

"అనగనగా వొక కోమటి. చాలా డబ్బున్న వాడతడు. అతని అంగడి చాలా పెద్దది. అంత పెద్ద అంగడి రాజమహేంద్రవరంలోనూ, కాకినాడలోనూ కూడా లేదు. అతని కొక్క కొడుకూ, వొక్క కూతురూను. ఇలాగే దీపావళి వచ్చింది. ఆ వూళ్ళో పిల్లలందరూ తల్లిదండ్రుల నడిగి డబ్బు సంపాదించుకున్నారు. ఆ కోమటి కూడా, కొడుక్కీ కూతురికీ చెరో రూపాయీ యిచ్చాడు. తన రూపాయిక్కీ రకరకాల బాణసంచా కొని దీపాలు పెట్టీపెట్టగానే కాల్చేశాడు కొడుకు."

"ఛీ, బాగా చీకటి పడకుండానే?" అనడిగాను నేను.

"దుడుకు పిల్లకాయలకు అందమూ చందమూ ఏమిటి నాన్నా? రూపాయి కాల్చెయ్యడమే వాళ్ళ పని"

"వాడి మాటకేం, ఆ పిల్ల యెలాంటివి కొందో అది చెబుదూ"

"ఆపిల్ల కూడా రకరకాలూ కొంది"

"నాకు తెలుసు. బాగా చీకటిపడిన తరవాత వాళ్ళ అమ్మ దీపాలు పెట్టుకోడం కూడా అయిపోయాక కాల్చింది అవి. అవునా?"

"అబ్బే, ఆపిల్ల కాల్చనే లేదోయ్, పాపం"

"ఏం, భయమా? అన్నా తమ్ముడా వాడు, ఆ బడుద్ధాయిచేత కాల్పించిందా?"

"ఛా, ఛా, రూపాయి బుగ్గిచేసినవాడు వాడు. వాణ్ణి నమ్ముతుందా నాయనా, ఆ రాజాపిల్ల?"

"మరేం చేసిందమ్మా?"

"వీధిగుమ్మాన తండ్రి అంగడి. పెరటిగుమ్మాన ఆ పిల్ల అంగడి పెట్టింది"

"అమ్మేసిందా?"

"మరే నాన్నా"

"అయ్యో, సరదా లేదు కామోసు ఆ పిల్లకి"

"అదేమిటి నాన్నా? ఆ పిల్లకే సరదా లేకపోవడం? అది మంచి ఆలోచనపరురాలు. అంచేత, దాని సరదా వేరు. కాకపోతే, అన్నలాగే ఆ రూపాయి కాల్చేసి, తెల్లమొగంవేసుకుని—"

"అమ్మితే, ఆరూపాయీ మళ్ళీ చేతికి వచ్చిందంటావు నువ్వు. అంతేనా?"

"సరే, పెట్టిన రూపాయి మాత్రమే వస్తే యిక అమ్మడం యెందుకూ శ్రమపడి? చాలా రూపాయిలే వచ్చాయి"

"చాలా రావడానికి దానిదగ్గర యెవరు కొన్నారూ?"

"పెద్ద అంగళ్ళలో కానివీ, అరణావీ అమ్మరుగా? బీదవాళ్ళు అంతకంటే కొనలేరుగా?"

"వాళ్ళ కమ్మిందా?"

"లాభం రావాలి గాని యెవళ్ళ కమ్మితేయేం?"

"అన్నీ అమ్మేసిందా?"

"అమ్మేసింది"

"ధూ......పోనీ అమ్మేసి?"

"మళ్ళీ కొంది"

"కొని?"

"మళ్ళీ అమ్మింది"

"దీపాలు పెట్టాక కూడా అమ్మిందా?"

"ఊళ్ళోవాళ్ళు బాణసంచా కాల్చడం మానేసేదాకా అమ్మింది. రూపాయి అయిదు రూపాయిలు కూడా అయిపోయింది"



[ప్రచురితమగుతున్న కొత్త సీరియల్]

"బాబోయ్!...అయితే, అమ్మా, కొంచ మయినా మిగుల్చుకోకుండా అన్నీ అమ్మేసిందా?"

"అది మిగుల్చుకోలేదు. వాటి కవే మిగిలి పోయాయి కొద్దిగా"

"అయిదు రూపాయిలు దాచుకుని అవి కాల్చుకుందా?"

"లేదు, అవీ దాచింది"

"దాచి?...ఎక్కడో అడివిపిల్లలా వుందే?"

"దానికేం కర్మం? అదే అడివిపిల్లలను చేసే సింది అందర్నీ"

"పోనీ, దాచి?"

"కార్తిక పున్నమికి మళ్ళీ అంగడి పెట్టింది"

"పెడితే?"

"అయిదల్లా పది రూపాయిలయాయి"

"అవి దాచుకుంది, కదూ?"

"ఛా, తెలివితక్కువదా యేమిటి ఆ పిల్ల డబ్బు దాచుకోడానికి?"

"నేను మాట్లాడలేకపోయాను. నా స్థితి గురించి మా అమ్మ మళ్ళీ మొదలుపెట్టింది"

"ఆ పదిరూపాయిలకూ ఉప్పూ, మిరపకాయలూ—ఇలాంటివి కొని పెరటిగుమ్మాన చిల్లర అంగడి పెట్టింది. వర్తకం పెరిగింది. పిల్ల పెద్దదయింది. పెళ్ళి కూడా అయింది. అయినా వర్తకం చేస్తూనే వుంది. చేసిచేసి కాపరానికి వెళ్ళేటప్పుడు, స్వార్జితం, వెయ్యి రూపాయిలు పట్టుకువెళ్ళింది"

"ఒక్క రూపాయికి వెయ్యిరూపాయిలా?"

"వెర్రెమిటి కోమట్లకి లక్షలు మాత్రం వొక లెక్కా నాయనా? కోట్లకు పడగలెత్తగల జాతి అది. తలుచుకుంటే, వొక్క రూపాయి కూడా పెట్టుబడి లేకుండా పెద్దపెద్ద వర్తకాలు చెయ్యగలరు కోమట్లు, తెలుసా?"

"నేను తెల్లపోయాను. అది కనిపెట్టి మా అమ్మ మరోకథ మొదలుపెట్టింది."

"అనగనగా వొక కోమటి. ఎంతో భాగ్యవంతు డతను. రాజుగారికి అతనిమీద, ఎందుకో కోపం వచ్చింది. కట్టుగుడ్డలతో లేవదీసి, తెల్లవారాటప్పటికి, నూరామడల దూరాన వొక పల్లెటూరి చెరువుగట్టున విడిచిపెట్టారు రాజభటులు, అతన్నీ, పెళ్ళాన్నీ"

"పా-పం"

"చేతిలో కానీ లేదు. అమ్ముకుందా మంటే భార్య వొంటిమీద నల్లపూస అయినా మిగల్చ లేదు రాజు"

"మరి వాళ్ళకి అన్నం యెలాగే అమ్మా?"

"పుట్టింది కోమటిపుట్టుక కదా, వాళ్ళకే అన్నం లేకపోవడం?"

"ఎలా వచ్చిందీ మరి?"

"అతగాడు వర్తకం చేశాడు, సంపాదించాడు"

"ఆ పూటే?"

"ఆ పూట దాకానా? అ క్షణాన"

"డబ్బేదీ?"

"అక్కడే వుంది రహస్యం. మనవాడయితే వృత్తికి తారతమ్యాలు కల్పించుకుని. మాడి చస్తాడు. "అయిన యింట పుట్టి తక్కువ పని చెయ్యనా?" అన్న అభిజాత్యగర్వం యెక్కడ వుంటుందో అక్కడ సర్వనాశనమే. డబ్బుంటేనే తక్కిన యేమయినా నిలుస్తాయి. డబ్బు లేని వాడికి బతుకే శూన్యం, గౌరవం యెక్కణ్ణుంచి వస్తుంది, వాడి కిక అభిజాత్యం అంటే యేమిటి? వెనకా ముందూ యేమయితే యేం, అప్పటి స్థితిగతులను పట్టి నడుచుకోడంలోనే వుంది ప్రజ్ఞ.

* ఆనందవాణి

కమల:

తళతళ మెరయు
శిరోజములు...
నిష్కళంకమైన ముఖ
కాంతి...

## *ఈమె సుందరాంగి!
## ఈమె పాండ్సును ఉపయోగించును!




ప్రతియొక యువతి, మరియు బాలికలు అడగిన తమ సౌందర్యమును బయలు పరచు సాహసము చేయుచున్నారు.

...మనోహరమైన ముఖ కాంతి ఆకర్షణీయమైన ముఖ వర్ఛస్సును చేకూర్చును. పాండ్స్ కోల్డ్ క్రీము నందుండు సహజమైన నూనెలతో మీ ముఖమును మెత్త బరచుడు.

# పాండ్స్ క్రీమ్స్




**పాండ్స్ కోల్డ్ క్రీమ్:** దినమునకు రెండుమాళ్లు ప్రేళ్ళ కొనలతో రాచి కడుగుము. తరువాత దీనిని పాండ్స్ టిష్యూతో తుడిచి వేయుడు.




**పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్:** కోల్డ్ క్రీమును బయిటికి తీసి వ్యానిషింగ్ క్రీమును అంటించుడు. అంటించుచుండగానే అదృశ్యమగును. మీముఖమును కాపాడును.




**పాండ్స్ పౌడర్** పువ్వువలె మృదుత్వము కావలయునన్న ఈ పౌడరును తరువాత అంటించుడు.

వ్యాపార వివరములకు క్రింది విలాసమునకు వ్రాయుడు:

**యల్. డి. సేమూర్ & కం|| (ఇండియా) లి||**

బొంబాయి – కలకత్తా – కరాచి – మదరాసు

Copyright: Pond's Extract Co.

ఆదిలో లక్షాధికారి అతను, మరి, అప్పు డేమి చేశాడో యెరుగుదువా? ఒక్క మాటు అలాగా యిలాగా పారజూశాడు. ఎటు చూసినా ప్రతీ చేలోనూ కొండల్లాగ వరికుప్పలు, కొన్ని కుప్పలు రైతులు నూరుస్తున్నారు. ఇంకేం, దారి కనపడిం దతనికి."

"ధాన్యం అడిగి తెచ్చుకున్నాడా, ఆ పూటకి?"

"ఛీ, ఛీ, ఒకళ్ళ కిస్తాడు గానీ, దేహీ అని కోమటిబిడ్డ వొకళ్ళని దేవురిస్తాడా? అతను వర్తకం చేశా డని చెప్పాను కాదూ?"

"ఏమి వర్తకమూ?"

"వర్తక మున్న వర్తకమా? గాలి పోగు చేశాడు, దీపాలు పెట్టాటప్పటికి మళ్ళీ వొక యింటివా డయిపోయాడు."

"ఇలా చెప్పి, మా అమ్మ, మళ్ళీ అందుకుంది"

"ఊరివాళ్ళు పగిలిపోయిన కుండ లన్నీ ఆ చెరువుగట్టున పారేస్తారు. ఆ గుట్టలోనుంచి వొక పెద్ద పెంకు తీశా డతను. గట్టున పడివుండిన మూడు మట్టిబెడ్డలు తెచ్చి పొయ్యి అమర్చాడు. ఆ చెట్టూ యీ చెట్టూ యెక్కి, యెండు చితుకులు విరిచి గుట్టలు పెట్టాడు. ఒక కుప్పనూర్పుడు దగ్గిరకి వెళ్ళి నిప్పు తీసుకువచ్చాడు. అతని పెళ్ళాం పెంకు కడిగి నిప్పు రాజేసింది. అతను నిశ్చింతగా వూళ్ళోకి బయలుదేరాడు."

"బియ్యం కోసమా?"

"కాదు, వర్తకం చెయ్యడానికి నాన్నా"

"మరి డబ్బే దమ్మా?"

"చెప్పాను కాదూ తండ్రీ? బుద్ధి వుంటే డబ్బెందుకూ? మనవాళ్ళు వర్తకం చేస్తే వున్నది కూడా వూడ్చుకుపోతుంది. కోమట్లు వర్తకం చేస్తే లేనిది పుట్టుకువస్తుంది."

"ఇలా అని, మా అమ్మ, నాకళ్ళల్లోని చూసింది. నే నప్రతిభుణ్ణయి వున్నాను. అది గమనించి మా అమ్మ, మళ్ళీ కథ అందుకుంది."

"తిన్నగా, అతను వూళ్ళోకి వెళ్ళాడు. ఊరంతా కాపజనం, అంతా వ్యవసాయదారులు, ధాన్యం గుట్టలూ, కొండలూ అయి మూలుగుతూ వుంటుంది వారి దగ్గిర. ఊరంతా—ప్రతీ వీధీ తిరిగా డతను."

### * స్వర్గం - నరకం *



"ఏమోయ్, మీ పొలం స్వర్గంలా వుందయ్యా"

"ఏమోనండి, ఈ పొలాన్ని దున్ని, గింజలు చల్లి, చేను కంచె వేసి, కోసి, కుప్పనూర్చి, ధాన్యం అమ్మి, పన్నులు చెల్లించి, బాకీలు తీర్చే సరికి యమలోకం అయిపోతుంది బాబూ!!"

---

"తిరిగి?"

"పేలాలోయి పేలాలు, వేడివేడి పేలాలు, వింతవింత పేలాలు, కమ్మకమ్మని పేలాలు, కరకరలాడే పేలాలు" అంటూ కేక పెట్టా డతను. చుట్టూ మూగి పిల్లలు "పేలా లేవీ" అనడిగారు. "చెరువుగట్టున వున్నాయి వెళ్ళం" డన్నా డతను. "వడ్లకి సగం, బియ్యానికి సరికి సరి" అని కూడా చెప్పా డతను.

"ఆగు, ఆగు, నాకు తెలిసిపోయింది రహస్యం, పిల్లలు తెచ్చిన వడ్లే పేలాలు చేసి యిచ్చింది అతని పెళ్ళాం, బియ్యం అన్నం వండింది."

"అంతేనా మరి? గంటగంటకీ తిరిగా డతను, వీధివీధికీ తిరిగాడు, మళ్ళీ మళ్ళీ వచ్చి పిల్లలు పేలాలు కొనుక్కున్నారు. చీకటి పడేటప్పటికి కుంచెడు బియ్యం చేరాయి. నాలుగు కుంచాల వడ్లు మిగిలాయి."

---

* ఆనందవాణి